కథ

# మిస్సెడ్ కాల్...

## పెద్దూరి వెంకటదాసు



మంచి మనసున్న మణిచందనగారికి..

'మీ మీద నా గుండెల్లో దాచుకున్న అభిమానాన్ని అక్షరాల్లోనే చెప్పలేకపోతున్నానే' అలాంటిది ఒక్కఫోన్ కాల్‌తో నా మనసులోని అభిప్రాయాన్ని ఎలా కమ్యునికేట్ చేయగలను? ఒక్క సహాధ్యాయి అనే అర్హత తప్ప ఎందులోనూ మీకు సరితూగని నన్ను మీ జీవితంలోకి ఆహ్వానిస్తూ టకటకా ఫోన్‌లో చెప్పగలిగిన మీ అపూర్వ వాక్చాతుర్యం నన్ను ఆశ్చర్య చకితుడిని చేసింది. నా మనసులో ఎవరిని ప్రతిష్టించుకొని ఆరాధించానో ఆ దేవతే తనకు తానుగా నన్ను నీదానిగా చేసుకొమ్మంటే, అంతకంటే ఒక ప్రేమికుడికి గొప్ప వరముంటుందా? మీలా నేను ఫోన్‌లో నా అభిప్రాయాన్ని చెప్పలేక అక్షర రూపంలో నా అంతరంగాన్ని ఆవిష్కరించాలని ప్రయత్నిస్తున్నాను. అదీ చేతకావడం లేదు. ఇదే విషయం మీరు అంత అవలీలగా ఫోన్‌లో ఎలా మాట్లాడగలిగారో అర్థం కావడం లేదు.

'మీకు నేనంటే ఇష్టమైతే ఒక్క మిస్డ్ కాల్ ఇవ్వండి చాలు' నేను ఫోన్ చేస్తానని మీరెందుకన్నారో నాకు తెలుసు. శ్రీశ్రీ గారన్నట్లు ప్రపంచంలోని బాధలన్నీ నా బాధలని చెప్పను గానీ, నాకున్న బాధ్యతలు మీకు తెలియజేయడం తప్పుకాదేమో! మా నాన్నగారు చనిపోయాక మా అమ్మ, చెల్లెల్ని నాతో పాటు హైదరాబాద్ తీసుకొచ్చి చెల్లెల్ని ఇక్కడే చదివిస్తున్నాను. ట్యూషన్స్ చెబుతూ ఇంటి బాధ్యతల్ని మోస్తున్న నాకు ఎలాంటి ప్రాపర్టీస్ లేవు. నా తక్షణ కర్తవ్యం మా చెల్లెలి పెళ్లి. సంబంధాలు వస్తున్నా నాకేదయినా ఉద్యోగం దొరికితే తప్ప పెళ్లిచేయలేని స్థితి. ఇది నా గురించి స్థూలంగా. ఇక నా మనసులోని భావాల గురించీ, చూపు మరల్చుకోలేని మణిచందనగారి అందం అందరినీ మంత్రముగ్ధుల్ని చేయవచ్చు. అందులో సందేహం లేదు. నాకు మాత్రం ఆ మంచి మనసు నచ్చింది.(ఈ మాత్రం చెప్పగలుగుతున్నానంటే మీ మనసులోని మాట చెప్పారు కాబట్టే) ఆశలయినా ఆకాంక్షలయినా అర్థవంతంగా వుండాలి. ఆకాశానికి నిచ్చెనలు వేయడం, అందని ద్రాక్ష పండుకు అర్రులు చాచడం అవివేకమైన పనే నా దృష్టిలో.

మిమ్మల్నందుకునే అర్హత లేదని నాకు తెలుసు. కానీ, మీ వ్యక్తిత్వాన్ని ఆరాధించడంలో తప్పులేదని ఆ భావాన్నే మనసులో నింపుకున్నా. ప్రేమకు అంతరాల వ్యత్యాసం తెలియదుగా. అందుకే. తప్పు చేస్తున్నానేమోనని నా మనసు కలవరపడుతున్నా...నేనేం ఆ విషయం బయటకు ప్రకటించలేదుగా అని సర్దిచెప్పుకునేవాణ్ణి నాకు నేనే. అలాంటిది ఏకంగా మీ నుంచి నా చెయ్యందుకోండని ప్రపోజల్ ఎదురయ్యేసరికి ఉక్కిరిబిక్కిరి అయ్యా. అందుకే మీ అంత త్వరగా స్పందించలేక పోతున్నా.

**మణిచందనగారూ...**

అత్యాధునిక కమ్యునికేషన్ వ్యవస్థ వున్న ఈ రోజుల్లో ప్రేమ లేఖలు రాసుకునే ప్రేమికులుండక పోవచ్చు. ఇది ప్రేమలేఖో, నా మనసులోని భావాలను ప్రోది చేసి రాస్తున్న అక్షర నివేదనమో! నాకు తెలియదు కానీ, నా దృష్టిలో అధునాతనం, పురాతనం అన్న పదాలు ప్రేమ విషయంలో సరికాదేమో! భూత భవిష్యత్ వర్తమానాలలో ఎప్పుడైనా మల్లె వాసనలో మార్పు వుంటుందా? అందుకే సినీ కవులు కూడా 'మనసున మల్లెల మాలలూగెనే' లాంటి పరిమళాలు వెదజల్లే పూల తోనే పోల్చారు మనసుని.

'చాలా కాలం నుంచి మిమ్మల్ని గమనించే నేనీ నిర్ణయానికొచ్చానని' మీరు చెప్పగలిగారు కానీ... నేను చెప్పలేకపోతున్నాను. నిర్మొహమాటంగా చెప్పాలంటే నా కంటూ కొన్ని అభిప్రాయాలున్నాయి. ఎన్నో సంవత్సరాల నుంచి ప్రేమించి, జాగ్రత్తగా గమనించి చేసుకున్న ప్రేమ వివాహాలెన్ని విఫలం కావడం లేదు. అలాగే పెళ్లినాటికి ఒకరి మొఖాలు ఒకరు చూసుకోని వారు కూడా పెళ్లయిన తర్వాత అన్యోన్యంగా వుంటూ ఆదర్శ దంపతులై జీవితం ఫలవంతంగా సాగించడం లేదు. ఎంత జాగ్రత్తగా గమనించినా, పెళ్లయిన క్షణం నుంచే ఎవరి మంచితనమైనా పరీక్షకు నిలిచేది. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం వివాహ వ్యవస్థ మీద.

ఇక మీమీద నాకున్న అభిప్రాయం.....

అందం, ఆస్తి, చదువు, వీటన్నింటికి మించి మీ వ్యక్తిత్వం అదే నన్ను ఆకర్షించింది. ఇది చెప్పడానికి ఇంత ఉపోద్ఘాతం అక్కర్లేదు. నేను 'ఎస్' అన్న మరుక్షణం జరగబోయే పరిణామాలు కూడా నాకు తెలుసు. నేను మొదటే చెప్పినట్లు ఒక్క చదువులో తప్ప దేంట్లోనూ మీకు నేను మొదటే చెప్పినట్లు ఒక్క చదువులో తప్ప దేంట్లోనూ మీకు సమ ఉజ్జీని కాను. అది మీ తల్లితండ్రులకు ఏమాత్రం రుచించదు. నీ పట్టుదల గురించి అన్నిట్లో అడ్జస్టయినా 'కులం' ప్రధాన అడ్డంకిగా నిలుస్తుందన్న విషయం మీకు తెలుసు. అందుకే మీ తెగింపు. ఫోన్‌లో మీరిచ్చిన వివరణ నన్ను మరోమారు ఆలోచించుకునేలా చేశాయి. ఇక్కడ నన్ను అపార్థం చేసుకోవద్దు. మీ వాళ్లేదో జడిసి నేను సందేహిస్తున్నాననుకోవద్దు. మీకోసం నా ప్రాణం తృణప్రాయం. అందులో ఎలాంటి సందేహం లేదు. నేను మనస్ఫూర్తిగా చెబుతున్న మాట ఇది. నా సమస్యల్లా... నా మీదే ఆధారపడ్డ నా తల్లి, నాచెల్లి వారి గురించే నా బెంగ. నా సోదరి పెళ్లి చేసి అత్తారింటికి పంపించిన మరుక్షణం నా నిర్ణయానికి ఎలాంటి మూల్యం చెల్లించడానికైనా నేను సిద్ధమే. కానీ, నా స్వార్థం కోసం వాళ్లనలా మధ్యలో వదిలేయడం నా మనసుకు నచ్చడం లేదు. నా ఆంతర్యం ఘర్షణ ఇదే.



మణిచందనగారూ...

సమరంలో విజయం సాధించి వచ్చినవాణ్ణే వీరుడనరు. ఆ పోరులో ప్రాణాలు పోగొట్టుకున్న వాణ్ణి కూడా వీరుడే అంటారు. మీ చిటికెన వేలు పట్టుకోవడానికి ఈ రెండు ఫలితాల్లో ఏదైనా నాకు సంతృప్తినిచ్చేదే. ఈ విషయంలో ఇదే నా నిర్ణయం కూడా. మీరు ఫోన్‌లో నాతో మాట్లాడుతున్నప్పుడు.. నా కళ్లకెలా కనిపించారో తెలుసా!

'నార చీరలు కట్టి శ్రీరాముని వెంట నడిచిన సీత కనిపించింది. శ్రీకృష్ణుడు వెంట కదనరంగాన కాలుమోపి కోదండాన్ని ధరించి అసురుని అంతాన్ని జూసిన ఆ స్వామి ప్రియసఖి సత్యాదేవి కనిపించింది.'

మీరు మాట్లాడిన ప్రతి మాట నా చివరి ఊపిరి వరకు పదిలంగా నా గుండెల్లో దాచుకుంటాను. మీకోసం ఎప్పటికైనా వేచి వుంటాను. మా చెల్లెలు పెళ్లయ్యే వరకూ మన పెళ్లి వాయిదా వేయగలరని నా ఈ చిన్ని కోరికను మన్నిస్తారని ఆశిస్తూ...

శుభాకాంక్షలతో.....
మల్లెపూవులాంటి మణిచందనగారికి
నా ఈ హృదయాభినందనలతో

శ్రీనివాస్

'మీకు నేనంటే ఇష్టమైతే ఒక్క మిస్డ్ కాల్ ఇవ్వండి చాలు' నేను ఫోన్ చేస్తానని మీరెందుకన్నారో నాకు తెలుసు. శ్రీశ్రీ గారన్నట్లు ప్రపంచంలోని బాధలన్నీ నా బాధలని చెప్పనుగానీ, నాకున్న బాధ్యతలు మీకు తెలియజేయడం తప్పుకాదేమో! మా నాన్నగారు చనిపోయాక మా అమ్మ, చెల్లెల్ని నాతో పాటు హైదరాబాద్ తీసుకొచ్చి చెల్లెల్ని ఇక్కడే చదివిస్తున్నాను.

బాలు..బాలసుబ్రహ్మణ్యం...

ఉత్తరం చదవడంలో పూర్తిగా మునిగిపోయిన బాలు తలెత్తి తండ్రి వంక చూశాడు... ఏంటన్నట్లుగా...

''చూశావుగా! ఈ లెటరు మీ అమ్మకు శ్రీనివాసరావ్ రాసిన లేఖ. అది ప్రేమలేఖో, అతని అభ్యర్థనో తెలియని పరిస్థితి. ఒక్క 'మిస్డ్ కాల్' ఇవ్వక ఆమెను అతడు మిస్ చేసుకున్న వైనం''ఒక్కసారిగా కళ్లద్దాల వెనక కనుకొలుకుల్లో నిలిచిన కన్నీటిని పంచె చెంగుతో తుడుచుకొని మళ్లీ చెప్పనారంభించాడు వేద ప్రకాష్ కొడుక్కి.

''మీ అమ్మ నన్నెందుకు పెళ్లి చేసుకుందో-అతన్నెందుకు కాదందో అతనికి తెలిసే సరికి జరగాల్సిన కార్యం జరిగిపోయింది. మీ అమ్మ అందట 'మనస్ఫూర్తిగా మీరు నన్ను ప్రేమించినట్టయితే ఒక్క మిస్డ్ కాల్' ఇమ్మందట. మీ దగ్గరి నుంచి ఎలాంటి రెస్పాన్స్ రాలేదంటే దానర్థం మీరు నాకు మళ్లీ ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని కూడా చెప్పిందట.

అతని దగ్గరి నుంచి ఎలాంటి ఫోన్ కాల్ రాకపోయేసరికి క్షణమొక యుగంలా కొన్ని రోజుల నిరీక్షణ తర్వాత ఈ నిర్ణయానికి వచ్చి శ్రీమతి వేద ప్రకాష్నయ్యానని మా పెళ్లయ్యాక మీ అమ్మ నాతో చెప్పింది. ఈవిషయమంతా పూసగుచ్చినట్లు పోస్టల్ డిలే వల్ల ఆలస్యంగా అందిన ఈ లేఖ చూపిస్తూ వెంటనే నేనతన్ని కలుద్దామని ఎంతో ప్రయత్నించాను. ఉద్యోగరీత్యా స్టేట్స్కు వెళ్లిపోయాడని తెలిసి చివరకు ఎలాగో అలా అతని చిరునామా పట్టుకోగలిగాను. జరిగిందంతా వివరంగా లెటర్ ద్వారా తెలిపానతనికి.''

అతని అంతరంగంలో ఏ సాగర మథనం జరిగిందో గాని మనస్ఫూర్తిగా మాకు శుభాకాంక్షలు తెలుపుతూ అనూహ్యంగా అతని దగ్గర నుంచి రిప్లయ్ వచ్చింది. మనసులు తేలికపడ్డాయి. అలా మా మధ్య లేఖల ద్వారా స్నేహసంబంధాలు కొనసాగుతున్నాయి ఈనాటికి. ఈ రోజు నీవింత ఉన్నత స్థితిలో వుండడానికి అతనే కారణం. 'మీ అబ్బాయి బాధ్యతను నాకు అప్పగించి నన్ను మీలో ఒకడిగా చూడండి'అని అతనడిగితే కాదనలేకపోయాం.

అలా నీ చదువుకయ్యే ఖర్చంతా అతనే భరించాడు. నీకసలు విషయం చెప్పనేలేదుకదూ... ఆ సమయం రానే వచ్చింది. అతనింత వరకూ పెళ్లి చేసుకోలేదు. తొలినాళ్లలో నేనెంతో ప్రయత్నించాను. అతన్ని పెళ్లికొప్పించడానికి. ఈ విషయంలో నేను సక్సెస్ కాలేకపోయాను.

ఇదిగో దీన్ని చదువు నీకే తెలుస్తుంది.

ఎక్కడో సొరుగులో భద్రంగా దాచిన ఆ లెటర్ జిరాక్స్ కాపీ కొడుక్కిచ్చాడు వేదప్రకాష్.

'మైడియర్ ఫ్రెండ్ శ్రీనివాస్..

మా క్షేమాన్ని కాంక్షించే మీకు మా మనసెందుకు కనిపించడం లేదో అర్థం కావడంలేదు.

మిమ్మల్ని పెళ్లిచేసుకోమన్న మా అభ్యర్థనకు మీ నుంచి ఎందుకు స్పందనలేదో కారణ తెలుసుకోవడం మా బాధ్యత కాదా!

మీరు మనస్ఫూర్తిగా ప్రేమించిన మణిచందన మిమ్మల్ని మనస్ఫూర్తిగా ప్రేమించిన మణిచందన భర్తతో హాయిగా సంసారం చేస్తుండగా... ఇంకా మీరు అవివాహితులుగా వుండడంలో అర్థం లేదు. మీరింకా అవివాహితులే అన్న విషయం మణిచందనకు చెప్పొద్దని నాతో ప్రామిస్ చేయించారు కాబట్టి సరిపోయింది. తను హాయిగా సంసారం చేసుకుంటోంది. ఈ విషయం తెలిస్తే తామె ఎంత ఆందోళనకు గురవుతుందో తెలుసా! మీరు మనస్ఫూర్తిగా ప్రేమించిన వ్యక్తి మానసిక క్షోభకు గురైతే మీకు కష్టంగా అనిపించదా? మీరడిగిన వెంటనే మా ఏకైక అబ్బాయి బాధ్యతలు మీ చేతిలో పెట్టడానికి మేమాలోచించామా? అనుకోకుండా జరిగిన ఓ తప్పును సరిదిద్దామన్న ఓ తృప్తి మాకు మిగల్చండి. ఈ సారి లెటర్లో మీ నుంచి పాజిటివ్ స్పందన వస్తుందని మణిచందనలో సగమైన నా మాటను మన్నిస్తారని ఆశిస్తూ....'

శుభాకాంక్షలతో
**మీ మిత్రుడు, ఆప్తుడు**
**వేదప్రకాష్**

ఆ లెటరు సాంతం చదివిన బాలసుబ్రహ్మణం చలించిపోయాడు.

అంతరించిపోతున్న మానవ సంబంధాల పరంపరలో అద్వితీయంగా మానవ విలువలకు పట్టం కట్టే మనుషులుంటారని మొదటిసారి తెలిసిందతనికి. ఆ లెటర్స్ చదివాక, అందుకే...

సుళ్లు తిరుగుతున్న కన్నీటిని ఆపుకోలేక ఒక్కసారిగా తండ్రి ఒళ్లో వాలి పసిపిల్లాడిలా బావురుమన్నాడు. తనని తాను నిగ్రహించుకోలేదక...

వేదప్రకాష్ ఆర్తిగా కొడుకు తలనిమురుతూ..

''అవును బాబూ! మణిచందన ఉందన్న భ్రమలో అతన్నైనా తృప్తిగా వుండనీ! అని నేనే కావాలనీ తెలపలేదతనికి మీ అమ్మచనిపోయిందని. నా 'మణి' నిన్ను కని పచ్చిబాలింతగానే కన్ను మూసిందని పెళ్లయిన ఏడాదికే నా ఇంటిదీపం ఆరిపోయిందని పాపం ఆయనకేం తెలుసు?'

నా ఇంటి దీపం ఆరిపోయినా నా మణిచందన ఆత్మశాంతికోసం అతనింట్లో దీపం వెలిగిద్దామన్న నా ఈ ప్రయత్నం కూడా అతని సంకల్పబలం ముందు వీగిపోయింది. ఆ 'మిస్డ్ కాల్'లాగే.

★



## గ్రేసీ కనబడుట లేదు!?

'దేశ్ ద్రోహి'సినిమాకి సంబంధించి పాట షూట్ చేస్తున్నారు. అందులో గ్రేసీ సింగ్ నటిస్తోంది. అంతలో ఏమయిందో ఏమో పోలీసులొచ్చారు. పోలీసుల్ని చూడగానే షూటింగ్ సిబ్బంది కొంచెం ఇబ్బంది పడి, తలో దారీ జారుకున్నారు. వాళ్ళలా జారుకోవడాన్ని చూసి, గ్రేసి సింగ్ కూడా చల్లగా జారుకుని, హోటల్కి చేరుకుంది. తర్వాత అట్నుంచి అటు ఫ్లైటెక్కి, ముంబాయి చేరుకుంది. ఈ సంగతి తెలీని షూటింగ్ సిబ్బంది,గ్రేసి కోసం వెదకని చోటంటూ లేకపోయింది. ఎక్కడా గ్రేసి కన్పించక పోయే సరికి వాళ్ళంతా జుత్తు పీక్కున్నారు. ఆఖరికి ఆవిడ ముంబాయిలో ఉన్నదని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. 'ఏంటమ్మా చెప్పా పెట్టకుండా పారిపోయావ్'అనడిగితే 'మీరంతా ఎందుకు పారిపోయారు' ఎదురడిగింది గ్రేసి.' పర్మిషన్ తీసుకోకుండా అక్కడ పాట షూట్ చేస్తున్నాం. అది తప్పు! అందుకే అలా చేయాల్సొచ్చింది' అన్నారు. 'అలాగా! నాకా సంగతి తెలీదు. మీరంతా జారుకుంటుంటే నేనూ జారుకున్నాను. తప్పయిపోయింది' అంది. ఇప్పుడదే పాటని గోవాలో షూట్ చేస్తున్నారు. ఇక్కడేమవుతుందో మరి!!